## క్లుప్తంగా

### పుస్తకాల పంపిణీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన బొమ్మి రంగారావు స్మారక గ్రంథాలయ ట్రస్ట్ అధ్యక్షుడు బొమ్మి మురళి, కార్యదర్శి రెడ్డి నాగేశ్వరరావు, కోశాధికారి చింతల సూర్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక 41వ డివిజన్‌లోని నరసింహ స్పెషల్ మోడల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, చాక్లెట్లు బహూకరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువు కొని పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొత్తల రాము, బండి వెంకటేశ్వరరావు, రెడ్డి శ్రీనివాస డాంగే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాళ్లూరి రామారావు ఉపాధ్యాయులు సీహెచ్ వెంకటరత్నం, టి.లక్ష్మీదేవి, కె.బోడియ్య తదితరులు పాల్గొన్నారు.

### యూనిఫాం పంపిణీ

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక మోడల్ ప్రైమరీ పాఠశాలలో బుధవారం 80 మంది విద్యార్థులకు దుస్తులు, బెల్టులు, బ్యాగులు పంపిణీ చేశారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులు నంబూరి రాంబాబు, నాయకులు సూచించారు.

### 5 నుంచి సీపీఐ జిల్లా మహాసభలు

ఏలూరు (టూటౌన్): సీపీఐ ఏలూరు జిల్లా ద్వితీయ మహాసభలు ఈనెల 5, 6, 7 తేదీల్లో చింతలపూడిలో నిర్వహించనున్నట్టు సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తెలిపారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో బుధవారం నిర్వహించిన ఆయన మాట్లాడారు. 5న నిర్వహించే బహిరంగ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమల స్థాపన, పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఉద్యమిస్తామన్నారు. నాయకులు బండి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి హేమ శంకర్ పాల్గొన్నారు.

### టీచర్ల కొరత తీర్చాలి

ఏలూరు (టూటౌన్): కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ తరఫున కలెక్టర్‌కు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. బదిలీ కౌన్సిలింగ్ సందర్భంగా టీచర్స్ కొరత ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ మండలాల్లో మొత్తం 82 పాఠశాలలు ఉండగా, ఒక పాఠశాలకు ఒక ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారని తెలిపారు.

### నిత్యావసరాల పంపిణీ

దెందులూరు: వృద్ధుల సేవ దేవుని సేవతో సమానమని సాల్వేషన్ ఆర్మీ డివిజనల్ కమాండర్ మేజర్ ఏసు రాజ్యం, లత అన్నారు. బుధవారం కొవ్వలి షాలేము వృద్ధుల ఆశ్రమంలో దాత లక్ష్మి పేస్టులు, బ్రష్‌లు, పళ్లు, రొట్టెలు వంటి నిత్యావసరాలను వృద్ధులకు పంపిణీ చేశారు. సాల్వేషన్ ఆర్మీ హోంలీగ్ ట్రెజరర్ లీనా ప్రశాంతి, కొవ్వలి షాలేము, మేజర్ సుబ్బారావు, కోర్ అధికారులు పాల్గొన్నారు.

# ఏలూరు నగరం.. రోడ్లన్నీ ఛిద్రం

- గోతులు పూడ్చిన కొద్ది రోజులకే తిరిగి ప్రత్యక్షం
- నగరంలోని రోడ్లపై ప్రయాణం నరకం
- పాలకులు, అధికారుల పనితీరుపై ప్రజల ఆగ్రహం

ఏలూరు (టూటౌన్): చినుకు పడితే చాలు ఏలూరు నగరంలోని రోడ్లన్నీ ఛిద్రంగా మారుతున్నాయి. వీటిపై ప్రయాణం సాగించాలంటే ప్రజలు హడలిపోతున్నారు. నగరంలో దాదాపు 600 రోడ్లపై ఏర్పడిన గోతులను రూ.1.25 కోట్ల వ్యయంతో పూడ్చారు. ఇది జరిగి మూడు నెలలు తిరక్కుండానే తిరిగి గోతులు ప్రత్యక్షమయ్యాయి. రోడ్లన్నీ అద్దంగా చేశామంటూ నేతలు గొప్పగా ప్రకటనలు గుప్పించినా క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడంలేదు. గత కొన్ని రోజులుగా కురుస్తోన్న తేలికపాటి వర్షానికే రోడ్లన్నీ ధ్వంసమయ్యాయి. తిరిగి యథాతథంగా గోతులు ఏర్పడ్డాయి. ఆయా మార్గాల్లో రాకపోకలకు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మారుమూల ప్రాంతాల్లోని రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా తయారైందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**జలమయం**

మూడు రోజులుగా కురుస్తోన్న తేలికపాటి వర్షానికి నగరంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. మురుగు నీరు రోడ్లపై చేరింది. బురద, వ్యర్థాలతో రోడ్లు దర్శనమిస్తున్నాయి. స్థానిక వంగాయగూడెం క్యాన్సర్ ఆస్పత్రి రోడ్డు, బీడీ కాలనీకి వెళ్లే రోడ్డు, ఏలూరు 12 పంపుల సెంటర్, పవరుపేట సెంటర్, రైల్వేట్రాక్ రోడ్డు, పవరుపేట రైల్వే గేటు సెంటర్, శ్రీనివాస థియేటర్ రోడ్డు, ఎన్‌ఆర్‌పేట ఇలా ప్రతి రోడ్డుపైనా వర్షం నీరు చేరింది. వ్యర్థాలూ అదే స్థాయిలో రోడ్డుపైకి వచ్చి చేరాయి. రోడ్లపై గోతుల్లో వర్షం నీరు వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రివేళల్లో అయితే తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.



వంగాయ గూడెం నుంచి కొత్తూరు వెళ్లే మార్గంలో క్యాన్సర్ ఆస్పత్రి వద్ద రోడ్డు పరిస్థితి



పాత బస్టాండ్ నుంచి తూర్పులాకులకు వెళ్లే ప్రధాన మార్గంలో రైల్వే స్టేషన్ వద్ద రోడ్డు దుస్థితి



తంగెళ్లమూడి సబ్ స్టేషన్ నుంచి బీడీ కాలనీకి వచ్చే ప్రధాన రోడ్డు ఇలా..

**జన జీవనం అస్తవ్యస్తం**

వర్షాలకు సాదారణ జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. అడుగు తీసు అడుగు బయట పెట్టలేని పరిస్థితి నెలకొంది. ప్రయాణికులే కాకుండా రోడ్లపై చిరు వ్యాపారాలు నిర్వహించే వారి పరిస్థితి దారుణంగా తయారైంది. రైల్వే ట్రాక్ రోడ్డు నిండా వర్షం నీరు చేరి రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలను సంరక్షించుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. తోపుడు బండ్లు, కూరగాయల వ్యాపారులదీ ఇదే పరిస్థితి.

### మొక్కుబడి పనులు



మూడు నెలల కిందట నగరంలోని పలు రోడ్లను బాగు చేశామంటూ నేతలు, అధికారులు ప్రకటనలు గుప్పించారు. రోజుకో ఫొటోకు ఫోజులిచ్చి ప్రజలకు ఎంతో మేలు చేసినట్టు ప్రకటించారు. తీరా మూడు నెలల తర్వాత కురుస్తున్న తేలికపాటి వర్షానికే రోడ్లపై గోతులు యథావిధిగా ప్రత్యక్షమయ్యాయి. నేతలు చెప్పేదానికి, చేసే దానికి సంబంధం లేకుండా ఉంది.

– బండి వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు, ఏఐటీయూసీ, ఏలూరు

### రోడ్లన్నీ ఛిద్రమే



గత మూడు రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షం దెబ్బకు నగరంలోని రోడ్లన్నీ ఛిద్రమయ్యాయి. మూడునెలల కిందట రోడ్లన్నీ బాగు చేసేశామంటూ అధికారులు, ప్రజాప్రతినిధులు గొప్పగా చెప్పుకున్నా పనుల్లో నాణ్యత లేమీ కొట్టొచ్చినట్లు కన్పించింది. తక్షణం పాడైపోయిన రోడ్లను బాగు చేయాలి. నగర ప్రజల ప్రయాణ అవస్థలను తీర్చాలి.

– బి.సోమయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు, సీఐటీయూ, ఏలూరు

### సమ్మె కరపత్రం విడుదల



సమ్మె కరపత్రం విడుదల చేసిన హమాలీ వర్కర్లు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 9వ తేదీన నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని మార్కెట్ యార్డు హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆఫీస్ వద్ద ఐఎఫ్‌టీయూసీ ముద్రించిన సమ్మె కరపత్రం బుధవారం విడుదల చేశారు. మీసాల రమణ, మంగరాజు రాము,కోరాడ అప్పారావు, సూరిబాబు, దుర్గారావు,రెడ్డి రమణ, తాబేలు శ్రీను, మజ్జి శ్రీను, నకిరెడ్డి లక్ష్మణరావు, నూకరాజు, ఘడసాల వెంకటరమణ, మీసాల నాగరాజు, త్రినాథ్ పాల్గొన్నారు.

### మద్యపాన నిషేధం అమలు చేయాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో తక్షణమే మద్యపాన నిషేధం అమలు చేయాలని పీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ జీవన్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థులు మద్యపానానికి అలవాటై భవిష్యత్తుని పాడు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే మద్యపానం నిషేధించి రాష్ట్రంలో విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

### ● బాహుబలి పుట్టగొడుగు



అందరిలా ఉంటే వెరైటీగా ఏముంటుందిలే అనుకుందో ఏమో ఈ పుట్టగొడుగు. ఇదిగో ఇలా బాహుబలిలా పెరిగింది. సాధారణంగా పుట్టగొడుగులు నిమ్మకాయ సైజులో ఉంటాయి. కాని ఎన్‌ఆర్‌పేటలోని డాక్టర్ సత్యనారాయణ వీధిలో చెట్టు నరికేసిన మొదల్లో ఇదిగో ఇలా సుమారు ఫుట్‌బాల్ సైజులో ఆకర్షిస్తోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు

### రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని అశోక్ నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అమీనా పేట, అశోక్ నగర్, అమీనా పేట ఏటిగట్టు, అటవీశాఖాధికార కార్యాలయ ప్రాంతం, గంగానమ్మ అమ్మవార దేవస్థానం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

**రూరల్ మండలంలో..**

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం కొమడవోలు, పారేపల్లి, చాటపర్రు రోడ్డు, హమాలీ కాలనీ, దుర్గా గ్రాండ్ సిటీ, అందాలమ్మ తోట, రామ్ నగర్, మారుతి నగర్, మస్తాన్ మన్యం కాలనీ,నాగేంద్ర కాలనీ, శ్రీరాంనగర్ కాలనీ, శాస్త్రి కాలనీ, చెంచుల కాలనీ, ఆటోనగర్, కొమడవోలు, తూర్పులాకులు, సాయి నగర్, ఎన్‌టీఆర్‌కాలనీ, మల్కాపురం, ఇందిరమ్మ కాలనీ, చాటపర్రు ఎస్సీ కాలనీ, చంద్రబాబునాయుడు కాలనీ, చాటపర్రు చేపల చెరువులు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ అంబేద్కర్ పేర్కొన్నారు.

# సాల్వేషన్ ఆర్మీ వ్యవస్థాపక దినోత్సవం

దెందులూరు: ఐదు ఖండాల్లో 134 దేశాల్లో 127 భాషల్లో సాల్వేషన్ ఆర్మీ ఆధ్యాత్మిక సామాజిక విద్య, వైద్య మౌలిక వసతులు కల్పన రంగాల్లో సేవలందిస్తోందని సాల్వేషన్ ఆర్మీ ఏలూరు డివిజనల్ కమాండర్ మేజర్ యేసు రాజ్యం, లత తెలిపారు. బుధవారం ఏలూరు సాల్వేషన్ ఆర్మీ హెడ్ క్వార్టర్స్‌లో 160 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వ్యవస్థాపక దినోత్సవం పతాకాన్ని ఎగురవేశారు. సాల్వేషన్ ఆర్మీ వ్యవస్థాపకులు బూత్ టక్కర్, విలియం బూత్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హోమ్లీంగ్ ట్రెజరర్ లీనా ప్రశాంతి వ్యవస్థాపక దినోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కోర్ ఆఫీసర్లు గృహ సమితి సభ్యులు పాల్గొన్నారు.



సాల్వేషన్ ఆర్మీ వ్యవస్థాపకులకు నివాళులర్పించిన కోర్ ఆఫీసర్లు

# ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలి

వేలేరుపాడు: గోదావరి వరదలు దృష్ట్యా ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు వేలేరుపాడు మండల తహసీల్దార్ కార్యాలయంలోని ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల వరదలకు మండలం నీటి మునుగుతుందని తెలిపారు. గూడు లేక తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని గుర్తు చేశారు. చీకటిలోనే తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. అనారోగ్యం చేస్తే రవాణా సౌకర్యం లేక మరణం తప్ప వేరే దిక్కే లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా మండలానికి తగినన్ని బోట్లు, తాత్కాలిక పునరావాసాలు, హెల్త్ క్యాంపులు, నిత్యావసర సరుకులు, బరకాలు, కిరోసిన్ లాంటివి ఏర్పాటుచేయాలని కోరారు. రవాణా ఖర్చులు ప్రభుత్వమే ఇవ్వాలని పేర్కొన్నారు. పార్టీ మండల కార్యదర్శి ధర్మాల రమేష్, సీనియర్ నాయకులు మడివి దుర్గారావు, నాయకులు కారం వెంకట్రావు, మడకం ఏసుబాబు, కొత్త వెంకటేశ్వర్లు, కరటం ప్రకాష్ పాల్గొన్నారు.

### మోకాళ్లపై కార్మికుల నిరసన

జంగారెడ్డిగూడెం: సమస్యలు పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్లు చేపట్టిన సమ్మె బుధవారం మూడో రోజు కొనసాగింది. మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ కంతేటి వెంకట్రావు అధ్వర్యంలో కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను త్వరగా పరిష్కారించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని వెంకట్రావు కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఎలక్ట్రికల్, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు తప్పని రేషన్ కష్టాలు

భీమడోలు: రేషన్ కష్టాలు ఈ నెల కూడా కార్డుదారులకు తప్పేటట్లు లేవు. వర్షంలోనే తడుస్తూ సరుకులను మోసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత నెల నుంచి ఎండీయూ వాహనదారులను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. దీని ఫలితంగా రేషన్ సరుకుల కోసం లబ్ధిదారులు దుకాణాల వద్దకే వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. మండల వ్యాప్తంగా 35 రేషన్ దుకాణాల పరిధిలో 20 వేలకు పైగా కార్డులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రెండో నెల రేషన్‌ను జులై ఒకటో తేదీ నుంచి పంపిణీ ప్రారంభించారు. రెండో రోజైన బుధవారం కూడా రేషన్ భీమడోలు బైపాస్ రోడ్డులోని రేషన్ దుకాణం వద్దకు ఓ బాలిక తాతను వెంటబెట్టుకొని వచ్చి, రేషన్ బియ్యం తీసుకెళ్లారు. ఆ వృద్ధుడు బియ్యం మూటను నెత్తిన పెట్టుకొని ఆయాసపడుతూ వెళ్లాడు. ఇదేతరహాలో మండలవ్యాప్తంగా అనేక చిత్రాలు దర్శనమిస్తున్నాయి. రేషన్ దుకాణాలు గ్రామానికి దూరంగా ఉండడం, సార్వా పనులు ముమ్మరంగా సాగుతున్న వేళ రేషన్ సరుకులు తెచ్చుకోవడం ఇబ్బందిగా ఉందని కార్డుదారులు అంటున్నారు.

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 36 | అరటి కాయ (1) | 06-08 |
| వంకాయలు (గులాబీ) | 34 | చిక్కుడు కాయలు | 70 |
| వంకాయలు (కాంతులు) | 40 | బిళ్లచిక్కుడు | -- |
| వంకాయలు (తెలుపు) | 40 | చామదుంపలు | 36 |
| బెండకాయలు | 36 | ములక్కాడలు | 08, 10 |
| పచ్చిమిర్చి | 40 | కంద | -- |
| కాకర కాయలు | 40-48 | బీట్‌రూట్ | 38 |
| బీరకాయలు | 30 | కీరా దోస | 40 |
| బీరకాయలు (పందిరి) | 40 | ఫ్రెంచ్‌బీన్స్ | 100 |
| క్యాబేజీ | 26 | అల్లం | 60 |
| క్యారెట్ | 40 | కొత్తిమీర (కట్ట) | 20 |
| దొండకాయలు | 40 | పాలకూర | 12 |
| బంగాళదుంపలు | 30 | తోటకూర | 10 |
| ఉల్లిపాయలు | 28 | చుక్కకూర | 12 |
| గోరుచిక్కుడు | 38 | గోంగూర | 07-10 |
| దోసకాయలు | 20 | పుదీనా | 05 |
| ఆనబకాయ (1) | 10-15 | క్యాప్సికమ్ | 90 |
| పొట్లకాయ(1) | 20 | చిలకడదుంప | 40 |

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

### ఏసీ బస్సులు..

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర) | 21.00 | 32 |
| ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర) | 21.30 | 37 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి) | 22.00 | 37 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్) | 22.30 | 21 |
| ఏలూరు - అమరావతి (ఇంద్ర) | 19.00 | రద్దు |

### సూపర్ లగ్జరీ

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో 22సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ | 21.45 | 4820 | 24 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ | 21.15 | 4822 | 27 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 21 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం | 10.45 | 4798 | 23 |
| ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం | 21.15 | 4802 | 27 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం | 21.00 | 4804 | 30 |
| ఏలూరు -ఈసీఐఎల్ | 22.30 | 4814 | 27 |
| ఏలూరు - తిరుపతి | 16.00 | 4830 | 30 |

# ఇరుకు వంతెనలతో ఇక్కట్లు



శతాబ్ది కాలంగా ప్రజలకు సేవలందిస్తున్న బ్రిటిష్ కాలం నాటి పూళ్ల వంతెన



గుండుగొలనులో నత్తనడకన జరుగుతున్న వంతెన పనులు

- కాలం చెల్లిన వంతెనలపై బిక్కుబిక్కుమంటూ రాకపోకలు
- ఏ క్షణంలో కూలుతుందోనన్న భయం
- ప్రభుత్వం నిధులు వెచ్చించి నిర్మించాలని డిమాండ్

భీమడోలు: గోదావరి కాలువపై ఇరుకైన వంతెనలు ప్రాణసంకటంగా మారాయి. ఇప్పటికే శిథిలావస్థకు చేరిన బ్రిటిష్ కాలం నాటి వంతెనలపై అధిక లోడు వాహనాలు రాకపోకలు సాగించడంతో ఏ క్షణంలో కూలుతాయోనన్న భయం ఆ గ్రామస్తులను వెంటాడుతుంది. నియోజకవర్గంలోని గుండుగొలను, నారాయణపురం గ్రామాల్లోని వంతెనలు కూలిపోగా, ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీంతో వారి జీవన విధానం దెబ్బతింది. దీంతో పాటు భయం గుప్పెట్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికే కాలం చెల్లిన ఆ వంతెనలపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో సామర్థ్యానికి మించి చేపల చెరువులకు వెళ్లే లారీలు ప్రయాణిస్తూ భయాందోళనలకు గురి చేస్తున్నాయి. ఎన్నికల సమయంలో పాలకులు వంతెనలు నిర్మిస్తామని హామీలిస్తున్నారే తప్ప పట్టించుకోవడం లేదని జనం విమర్శిస్తున్నారు. వంతెనలు కూలితే ప్రజా జీవనానికి తీవ్ర విఘాతం ఏర్పడుతుంది. సాధారణంగా వంతెనల పక్కనే బస్టాండ్ల వద్ద జనం కూడా ఎక్కువగా ఉంటున్నారు. ప్రమాదాలు సంభవిస్తే నష్టం తీవ్రంగా ఉంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**వంతెనలు.. జర జాగ్రత్త**

భీమడోలు మండలం పరిధిలో గోదావరి కాలువపై పూళ్ల, కురెళ్లగూడెం, పాతూరు, గుండుగొలను గ్రామాల్లో వంతెనలు శిథిలావస్థకు చేరాయి. గుండుగొలను వద్ద కూలిన వంతెన స్థానంలో శాశ్వత వంతెన పనులు నత్తనడక సాగుతున్నాయి. వంతెన నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. సమస్యను పరిష్కరించడంలో తాత్సారాన్ని చూపుతున్నారు. తాజాగా ఉంగుటూరు మండలం నారాయణపురం వద్ద వంతెన కూలింది. దీంతో ప్రజల అగచాట్లు వర్ణనాతీతం. పూళ్ల వంతెన నిర్మించి శతాబ్ద కాలం పూర్తయింది. ఎంఎం పురం, సాయన్నపాలెం, నిడమర్రుల్లో విస్తరించిన చేపల చెరువులకు భారీ వాహనాల్లో మేత, చేపల లోడ్ లారీలు యథేచ్ఛగా సాగుతున్నాయి. దీంతో బీటలు వారిన వంతెన కూలుతుందేమోనని భయం గుప్పెట్లో ప్రజలు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. కురెళ్లగూడెం వద్ద కాలువపై ఉన్న ఇరుకైన వంతెన రహదారికి ఎత్తులో ఉండడంతో ఆ వంతెనపై నుంచి కొల్లేరు గ్రామాలకు వెళ్లే భారీ వాహనాల రాకపోకలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే రక్షణ గోడ కూలింది. ఇరుకుగా ఉన్న వంతెనపై భారీ వాహనాలు ప్రయాణించడమే కష్టంగా ఉండగా భారీ లోడు వేసుకొని వెళ్లడంతో ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. దీనిపై అధిక లోడు లారీలు వెళ్లకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పాతూరు వద్ద నిర్మించిన వంతెన గోడ కూలి పోయింది. వంతెనపై బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిందే. రాత్రి వేళల్లో మరింత అప్రమత్తంగా ఉండాల్సి వస్తుందని, కనురెప్పపాటు నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదం పొంచి ఉంటుందని వారు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు చర్యలు చేపట్టి వంతెనలు నిర్మించాలని జనం వేడుకుంటున్నారు. ఇరుకైన వంతెనలపై భారీ వాహనాల ప్రయాణాన్ని నిలిపివేయాలని, ప్రభుత్వం నిధులు వెచ్చించి వంతెనల నిర్మాణాలు చేపట్టాలని వారు కోరుతున్నారు.